# 18. తిరునాళై పోవార్ నాయనారు

## (నందనారు)

నందనారు కులానికి అంటరాని వాడు. చోళరాజ్యంలో ఆదనూరులో జననము. నమ్రత, భక్తితత్పరత అతనిలో పుంజీభూతమయ్యాయి. పరమశివుడే అతని శరణాగతి. తీర్థయాత్రలు చేసి వివిధ శివస్థలాలను దర్శిస్తూ ఆయా దేవళములకు భేరి, మృదంగము వీణతీగెలు మొదలైన సంగీతోపకరణములను ఇచ్చేవాడు. అనేక శివస్థలములలో తోటలు పెంచాడు. తటాకములు త్రవ్వించాడు.

ఒకరోజున తిరుపున్కూరులోని శివుని చూడాలనుకున్నాడు. అక్కడ శివునికి కొంత సేవను చేద్దామని నిశ్చయించాడు. దేవుని చూడాలంటే నంది అడ్డము రావటంతో దుఃఖితుడయి దేవుని గూర్చి పరితపించాడు. మహాదేవుడు అతని భక్తికి మెచ్చి నందిని కొంత ప్రక్కకు తొలగుమని చెప్పి నందనారుకు దర్శనమిచ్చాడు. తిరుపున్కూరులో ఈ రోజుకి నంది ఒక ప్రక్కకు ఒదిగివుంది. ఆ దేవాలయమునకు ఓ చెఱువు త్రవ్వి పెట్టి ఆదనూరులోని తన నివాసానికి చేరాడు.

చిదంబరం వెళ్లి అచటగల నటరాజస్వామిని దర్శించాలని మనసా వాంఛించాడు. శివునియెడ భక్తి పెరిగిపోయింది. భాష్పాలు రాలుస్తూ, దేవునిమీద ప్రేమ చూపిస్తూ తోటివారికి - రేపు చిదంబరం వెళ్తానని చెబుతుండేవాడు. వెళ్లలేకపోయేవాడు. అందుకని అతనిని తిరునాళైపోనార్ (రేపు వెళ్లేవాడుగా) పేరు వాడుక అయింది.

ఒకరోజున నిజంగానే చిదంబరం వెళ్లాడు. ఆ గ్రామమంతా చుట్టాడు. తన నిమ్న బ్రదుకును తలచుకోగా - అతనిలో గుడిలోనికి వెళ్లాలనే కోరిక అంతరించింది. ఇలా దేముని ప్రార్థించాడు. “పరమశివా! నాట్యసభలో నీ నాట్యం దర్శించాలని వుంది. కాని ఎట్లా చూసేది? నేను నిమ్న జాతిలో పుట్టాను. అందుకని నన్ను లోనికి రానీయరు. నిన్ను ఎట్లా చూసేది?” ఈ విధంగా కొన్ని రోజులు ఏడవసాగాడు. శివునికి దయ కలిగింది. అందుకని నాయనారు కలలో కనిపించి “ నీవు విచారించవద్దు నీవు నా దగ్గఱకు వస్తావు, అగ్నిస్నానము చేయి. చేసి నా కనకసభకు బ్రాహ్మణులతో రమ్ము” అని చెప్పాడు.

నందనారుకు మెలకువ వచ్చింది. సంతోష భరితుడయ్యాడు. తిల్లయి (చిదంబరం)లోని బ్రాహ్మణులకు కలలో శివుడు కనబడి "నా భక్తుడు తిరునాలాయిపోనార్ తిల్లయి  వచ్చియున్నాడు. ఒక పవిత్రమైన అగ్నిని వ్రేల్చండి. నందనారు అగ్నిస్నానము చేసి నా దగ్గఱకు వస్తాడు" అని చెప్పాడు.

మరుసటిదినాన్నే బ్రాహ్మణులు అగ్నిని వుంచారు. నందనారు వద్దకు వెళ్లి అతనికి సాష్టాంగ నమస్కారము చేసి తమ కలను చెప్పారు. నందనారు అగ్ని చుట్టూ ప్రదక్షిణం చేసి శివుని పాద పద్మముల మీద దృష్టి సారిస్తూ, పరమశివుని నామాన్ని జపిస్తూ అగ్ని లోనికి దుమికాడు.

అందులోంచి వినూత్నమైన తేజంతో శరీరమంతా విభూతిరేఖలు నలుముకొని యజ్ఞోపవీతంతో జుట్టముడితో నందనారు బయటకు వచ్చాడు. నందనారును సగౌరవంగా దేవాలయంలోనికి తీసికొని వెళ్లారు. కనకసభలో నందనారు శివుని అర్చించాడు. నటరాజు నాట్య విన్యాసంలో తన్మయుడయ్యాడు. గదిలోంచి మిరుమిట్లు గొలుపు ఒక వెలుగురేఖ మెరిసింది. నందనారు అందులో అంతర్థానమయ్యాడు. నటరాజస్వామిలో లీనమయ్యాడు.

****